

సంగారెడ్డి ఎంసీహెచ్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

తగ్గని దగ్గు, ఆయాసం

- మిస్టరీగా కేజీబీవీ విద్యార్థినుల అస్వస్థత
- సంగారెడ్డి ఎంసీహెచ్‌లో 10 మందికి చికిత్స
- బీఆర్ఎస్, బీజేపీ, విద్యార్థి సంఘాల పరామర్శ
- బాలికల ఆరోగ్య పరిస్థితిపై మంత్రి దామోదర్ ఆరా

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న బాలికల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నప్పటికీ, ఒకరిద్దరిలో ఏ మార్పు కనిపించడం లేదు. దగ్గు, ఆయాసంతో ఇబ్బందిపడుతున్నారు. దీంతో ఆ విద్యార్థినుల కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. న్యాల్‌కల్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో రెండు రోజుల కిందట తీవ్ర దగ్గు, శ్వాస ఇబ్బందితో అస్వస్థతకు గురైన పది మంది విద్యార్థినులను శనివారం సంగారెడ్డికి తీసుకొచ్చి పిడియాట్రిక్ ఐసీయూలో చికిత్స అందిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే వారందరి రక్త నమూనాలు సేకరించి రోగ నిర్ధారణ పరీక్షలు చేయగా ఏమీ తేలలేదు. కానీ దగ్గు, శ్వాస కోశ సమస్య మాత్రం ఎంతకీ తగ్గడం లేదు. చికిత్స పొందుతున్న విద్యార్థినులకు నిరంతరం ముక్కు ద్వారా ఆక్సిజన్ అందిస్తున్నా ముగ్గురు మాత్రం ఇంకా శ్వాస సమస్యతో తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఆ ముగ్గురికి చెస్ట్ ఎక్స్‌రే చేయగా అంతా బాగున్నట్టు రిజల్ట్ వచ్చిందని ఆర్ఎంవో డా.మాధవి తెలిపారు. విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ జి.అనిల్‌కుమార్‌ను అడిగి మంత్రి దామోదర రాజనర్సింహ ఆదివారం తెలుసుకున్నారు. డీఈవో వెంకటేశ్వర్లుతో పాటు ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.అనిల్ ఎప్పటికప్పుడు బాలికల ఆరోగ్య పరిస్థితిని కలెక్టర్ వల్లూరు క్రాంతిని నివేదిస్తున్నారు. ఇలా ఉండగా కేజీబీవీ భవన నిర్మాణ పనుల వల్ల దుమ్మూధూళి వెలెవడడం, భవనానికి రంగులు వేయడం వల్ల దగ్గు, శ్వాస ఎలర్జీ సమస్యలు ఉత్పన్నమయ్యాయనే అనుమానాలను డాక్టర్లు వ్యక్తం చేస్తునప్పటికీ, కచ్చితమైన కారణం మాత్రం

మిగతా 8వ పేజీలో...

గడువు

పది రోజులే..

నవంబరు 6 వరకే పట్టభద్రులు, ఉపాధ్యాయ ఓటర్ల నమోదు

- నత్తనడకన ఎన్‌రోల్‌మెంట్
- ఆసక్తి చూపని గ్రాడ్యుయేట్లు
- పెరగనున్న ఉపాధ్యాయ ఓట్లు
- హోరాహోరీగా ఆశావహుల ప్రచారం
- రసవత్తరంగా మండలి పోరు
- కరీంనగర్-ఆదిలాబాద్-నిజామాబాద్-మెదక్ ఎమ్మెల్సీ ఎన్నిక



సిద్దిపేటలో పట్టభద్రుల ఓటరు నమోదుపై అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, అక్టోబరు 27: ఆరేళ్ల క్రితం 2019 మార్చి నెలలో కరీంనగర్-మెదక్- ఆదిలాబాద్-నిజామాబాద్ శాసనమండలి ఎన్నికలు జరిగాయి. అప్పుడు పట్టభద్రుల ఎమ్మెల్సీగా కాంగ్రెస్ నేత జీవన్‌రెడ్డి విజయం సాధించగా.. ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా కూర రఘోత్తంరెడ్డి గెలుపొందారు. వచ్చే మార్చి 29వ తేదీతో వీరి పదవీకాలం ముగియనుంది. అప్పటిలోగా ఓటర్ల నమోదు ప్రక్రియను పూర్తిచేసి మళ్లీ ఎన్నికలను నిర్వహించాల్సి ఉంటుంది. నవంబరు 6 వరకు నమోదు ముగుస్తుండగా.. డిసెంబరు నెలలో తుది జాబితా ప్రకటిస్తారు. ఆ తర్వాత ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేస్తారు.

ఆసక్తి చూపించని పట్టభద్రులు

ఓటు నమోదు ప్రక్రియపై పట్టభద్రులు ఆసక్తి చూపించడం లేదనే చర్చ జరుగుతోంది. ఆరేళ్ల క్రితం కూడా నాలుగు ఉమ్మడి జిల్లాలు కలిపి కేవలం 1,96,321 మంది గ్రాడ్యుయేట్లు మాత్రమే ఓటుహక్కు పొందారు. ఒక్క ఏడాదిలో డిగ్రీ, బీటెక్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేసే వారి సంఖ్య నాలుగు జిల్లాల్లో లక్షల్లో ఉంటుంది. గత ఎన్నికల నాటికి 10 లక్షల మందికి తక్కువ కాకుండా పట్టభద్రులు ఉన్నా ఓటర్ల సంఖ్య కనీసం 2లక్షలు కూడా దాటకపోవడం గమనార్హం. ఆరేళ్ల తరువాత జరుగుతున్న ఈ ఎన్నికల్లో గ్రాడ్యుయేట్ల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉంది. కానీ ఇప్పుడు కూడా ఓటుహక్కు నమోదు చేసుకోవడానికి నిరాసక్తత కనబరుస్తున్నారు. ఆన్‌లైన్‌లోనూ నమోదు చేసుకునే అవకాశం ఉన్నా పట్టించుకోవడం లేదు. రెవెన్యూ కార్యాలయాల్లోనూ ప్రత్యేక కౌంటర్లు

మిగతా 7వ పేజీలో...

ఆరేళ్లకోసారి జరిగే పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీల ఎన్నికలో ఓటేసే అవకాశం పొందాలంటే మరో 10 రోజుల సమయమే మిగిలి ఉంది. ఓటరుగా నమోదుకు వచ్చే నెల 6వ తేదీ వరకే గడువుంది. గడిచిన సెప్టెంబరు 30వ తేదీ నుండి ఓటర్ల నమోదు ప్రక్రియ మొదలైంది. ఫారం-18 ద్వారా పట్టభద్రులు, ఫారం-19 ద్వారా ఉపాధ్యాయులు తమ వివరాలను సమర్పించి ఎన్‌రోల్‌మెంట్ చేసుకోవాల్సి ఉంది. అయితే, అధికారుల వైపు నుంచి ఓటరు నమోదు ప్రక్రియ గురించి మొక్కుబడిగానే అవగాహన కార్యక్రమాలు ఉంటున్నాయి. ఓటు నమోదుపై ఆయా వర్గాల్లో చైతన్యం తెచ్చే ప్రయత్నాలు జరగడం లేదనే విమర్శలు నెలకొన్నాయి.

కొలువుల నిలయాలు

- ఉద్యోగాల సాధనకు బీసీ స్టడీ సర్కిల్, గ్రంథాలయం వేదిక
- నిరుద్యోగులకు అండగా నిలుస్తూ..
- కొలువుల కల నెరవేరడంపై ఉద్యోగార్థులు హర్షం



సంగారెడ్డిలోని జిల్లా కేంద్ర గ్రంథాలయం

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని బీసీ స్టడీ సర్కిల్, జిల్లా కేంద్ర గ్రంథాలయం కొలువులకు నిలయంగా మారాయి. వివిధ పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉండడంతో అభ్యర్థుల సన్నద్ధతకు ఉపయోగపడుతున్నాయి. పట్టణ ప్రజలే కాకుండా జిల్లా నలుమూలల నుంచి అభ్యర్థులు వచ్చి చదువుకుంటున్నారు. విశాలమైన గదులతో పాటు అన్నిరకాల వసతులు, అవసరమైన పుస్తకాలు, మెటీరియల్, పత్రికలను ఇక్కడ సమకూర్చుతున్నారు. ఇటీవల జరిగిన వివిధ పోటీ పరీక్షల్లో ఇక్కడ చదువుకున్నవారిలో చాలా మంది ఉద్యోగాలకు ఎంపికకావడం విశేషం.

కొలువుల గ్రంథాలయం

జిల్లా కేంద్ర గ్రంథాలయం ఉద్యోగ సాధనకు కేంద్రంగా మారింది. ఉదయం నుంచి రాత్రి వరకు చదువుకోవడానికి ప్రశాంత వాతావరణం, అన్నిరకాల ఉద్యోగాలకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉంచారు. కరెంట్ అఫైర్స్, చరిత్ర పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. అవసరమైన పుస్తకాలను అధికారులు ఇక్కడ సమకూరుస్తున్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలోనే చదువుకొని ఇటీవల డీఎస్సీలో 35 మంది ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించారు. అంతేకాకుండా 34 మంది టెట్‌లో అర్హత సాధించారు. 22 మంది పోలీసు కానిస్టేబుల్, ఒకరు ఎస్ఐ, ఐదుగురు గ్రూప్-1 మెయిన్స్‌కు అర్హత సాధించారని జిల్లా కేంద్ర గ్రంథాలయ కార్యదర్శి వసుంధర తెలిపారు.

29 మందికి టీచర్ ఉద్యోగాలు

సంగారెడ్డిలోని బీసీ స్టడీ సర్కిల్‌లో శిక్షణ పొందిన 29 మంది ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించారు. ఇందులో 21 మంది ఎస్జీటీ టీచర్లు, కాగా ఎనిమిది మంది

మిగతా 8వ పేజీలో...

పాలకుల నిర్లక్ష్యం.. ప్రజలకు శాపం

- అధ్వానంగా చల్మెడ- రాంపూర్ రహదారి
- ఏడాదిన్నర క్రితం రూ.12 కోట్లు మంజూరు

8

పరిశ్రమల మనుగడ ప్రశ్నార్థకం

- కార్మికుల కొరతతో చతికిల
- అర్హర్లున్నా అందించలేని వైనం
- ఉత్తరాది రాష్ట్రాల నుంచి కార్మికుల దిగుమతి
- 50 శాతం ఉత్పత్తితో నెట్టుకొస్తున్న యాజమాన్యాలు

7



పటాన్‌చెరు పారిశ్రామికవాడలో ఓ పరిశ్రమ ఎదుట వాంటెడ్‌బోర్డు

'తుఫాన్' బోల్తా.. పదకొండు మందికి గాయాలు

- ఇద్దరి పరిస్థితి విషమం
- హైవే 161పై ఘటన

7

హైవే పక్కన బోల్తాపడిన వాహనం



మేత కోసం మెతుకుసీమకు..

- మహబూబ్‌నగర్ నుంచి వేల సంఖ్యలో జీవాల వలసలు
- మెదక్-హైదరాబాద్ రోడ్డు పొడవునా గొర్రెల మందలు

గుమ్మడిదల వద్ద పాలమూరు గొర్రెల మంద



7



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

రాజీ లేదు.. రాజకీయం అసలే లేదు

అంచెలంచెలుగా అందోలు నియోజకవర్గ అభివృద్ధి

వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

జోగిపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తనకు రాజకీయ జన్మనిచ్చిన అందోలు నియోజకవర్గాన్ని అంచెలంచెలుగా అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. జోగిపేటలో శనివారం నిర్వహించిన జోగిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అభివృద్ధి విషయంలో రాజీ పడేది లేదని, రాజకీయాలు అసలే ఉండబోవని స్పష్టం చేశారు. కొంచెం ఆలస్యం కావొచ్చేమోగానీ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. నియోజకవర్గ అభివృద్ధికి ఇప్పటికే రూ. 400 కోట్ల నిధులు తీసుకువచ్చానని వివరించారు. 18 సంవత్సరాల క్రితం సింగూరు కాల్వలకు శంకుస్థాపన చేశానని, ఇప్పుడు రూ. 150 కోట్లతో కాల్వలకు సిమెంట్ లైనింగ్ చేయిస్తున్నామని చెప్పారు. గతంలో విద్యాశాఖ మంత్రిగా ఉన్నప్పుడు రూ. 450 కోట్లతో జేఎన్టీయూ, మూడు పాలిటెక్నిక్ కళాశాలలను ఏర్పాటు చేయించానని గుర్తుచేశారు. ప్రస్తుతం వైద్య ఆరోగ్యశాఖ మంత్రిగా అంతకుమించిన అభివృద్ధి చేసిచూపుతానన్నారు. జోగిపేట పట్టణంలో రూ. 45 కోట్లతో నర్సింగ్ కళాశాల, అనుబంధంగా ఒక 150 పడకల ఆస్పత్రిని నిర్మిస్తున్నామన్నారు. వట్‌పల్లిలో రూ. 35 కోట్లతో 50 పడకల ఆస్పత్రి, రాయికోడ్ చౌరస్తా వద్ద ఒక మెడికల్ సబ్ సెంటర్, సింగితంలో పీహెచ్‌సీని ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. హైవేపై ప్రమాదాలు జరిగితే బాధితులకు సత్వర వైద్యం అందించడానికి జోగిపేట, నిజాంపేట, సంగారెడ్డి చౌరస్తాల్లో ట్రామా కేర్‌సెంటర్లను ఏర్పాటు చేస్తామన్నారు. జహీరాబాద్-సంగారెడ్డి మార్గంలో కంకోల్ చౌరస్తా వద్ద మరో ట్రామాకేర్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. వ్యాపార, వాణిజ్య కేంద్రంగా వెలుగొందిన జోగిపేట పట్టణానికి పూర్వ వైభవం తెచ్చేందుకు కృషిచేస్తానని చెప్పారు. మెదక్ జిల్లాను జోగిపేటతో అనుసంధానించేలా రూ. 75 కోట్లతో జోగిపేట-అజ్జమరి గ్రామాల మధ్య మంజీరా నదిపై బ్రిడ్జి, కనెక్టింగ్ రోడ్లను నిర్మిస్తున్నామన్నారు. పార్టీ కోసం, తన గెలుపు కోసం కష్టపడిన ప్రతీ కార్యకర్తనూ గుర్తించి ప్రాధాన్యం కల్పిస్తానన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవిని కూడా నియోకవర్గానికే సాధించుకున్నామని, జడ్పీచైర్మన్ పీఠాన్ని కూడా సాధించుకుందామని పిలుపునిచ్చారు. అంతకు ముందు జోగిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమానికి జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ శేరి జగన్మోహన్ రెడ్డి, సంగమేశ్వర్, ఎస్ కృష్ణారెడ్డి, జోగిరెడ్డి, సురేందర్‌గౌడ్, ప్రవీణ్, చిట్టిబాబు, శివకుమార్, వెంకటరెడ్డి, రాజిరెడ్డి, అనిల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శంకర్, భాస్కర్, ప్రవీణ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

316 టపాసుల దుకాణాలకు అనుమతి

- నిబంధనలు పాటించాల్సిందే
- సంగారెడ్డి డీఎఫ్‌వో నాగేశ్వరరావు



సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 316 టపాసుల దుకాణాల ఏర్పాటుకు అనుమతి ఇచ్చామని జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి (డీఎఫ్‌వో) బి.నాగేశ్వరరావు తెలిపారు. సంగారెడ్డిలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ అధికారులు నిర్ధేశించిన స్థలాల్లో దుకాణాలు ఏర్పాటు చేయని 14 దుకాణాలకు అనుమతి నిరాకరించినట్లు తెలిపారు. మరో 20 దరఖాస్తులు క్షేత్రస్థాయి పరిశీలనలో ఉన్నాయని తెలిపారు. దుకాణాల యజమానులు నిబంధనలు తప్పకుండా పాటించాలని స్పష్టం చేశారు. అనుమతి లేకుండా ఎక్కడైనా టపాసులు డంప్ చేస్తే సమాచారం ఇవ్వాలని కోరారు.



బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో ఆందోళన చేస్తున్న పేదలు

ఇళ్లను కూల్చొద్దని పేదల ధర్నా

కుంటల పరిధిలోని నివాసాలకు అధికారుల మార్కింగ్‌తో ఆందోళన

జిన్నారం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): బొల్లారం మున్సిపాలిటీలో పలు కుంటల బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్ పరిధిలో పలు నివాసాలకు అధికారులు మార్కింగ్ చేయడంతో తమ నివాసాలను కూల్చొద్దని బొల్లారం కొత్త బస్‌స్టాప్ వద్ద ఆదివారం బాధితులు ధర్నా నిర్వహించారు. హైడ్రా పేరిట తమ నివాసాలను కూల్చవద్దని నినాదాలు చేశారు. కుడికుంట, కోమటికుంట, మాధవవానికుంట, రేలకుంటతో నాలుగు రోజులుగా ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిని నిర్ధారించి ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు మార్కింగ్ చేశారు. దీంతో తమ నివాసాలను హైడ్రా అధికారులు కూల్చివేస్తారనే భయంతో బాధితులు ధర్నా నిర్వహించారు. ఒక్కో పైసా కూడబెట్టి తాము నిర్మించుకున్న నివాసాలను కూల్చవద్దని తమ బతుకులు ఆగం చేయద్దని వేడుకున్నారు. బాధితుల ఆందోళనకు మునిసిపల్ కౌన్సిలర్ గోపాలమ్మ, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, నాయకులు వరప్రసాద్‌రెడ్డి, వెంకటయ్య మద్దతు తెలిపారు. బాధితులకు అండగా ఉంటామని సమస్యను పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్ సహకారంతో మంత్రి రాజనర్సింహ దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. అనంతరం నిమ్మరసం ఇచ్చి బాధితుల ఆందోళనను విరమింపజేశారు.

దౌర్జన్యంగా భూసేకరణ చేయనీయం

పెద్దకంజర్లలో కొనసాగుతున్న అసైన్డ్ రైతుల ఆందోళన

పటాన్‌చెరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఓవైపు అసైన్డ్ భూములపై రైతులకు శాశ్వత హక్కులు కల్పిస్తామని చెబుతూ మరోవైపు బలవంతంగా భూసేకరణ చేస్తున్నారని పటాన్‌చెరు మండలం పెద్దకంజర్ల అసైన్డ్ రైతులు ఆగ్రహం వ్యక్తంచేశారు. గ్రామంలోని సర్వే నంబర్ 120, 121, 125లో వందలాది మంది దళితులు, బీసీలకు దశాబ్దాల క్రితం అసైన్డ్ పట్టాలు ఇచ్చి ప్రస్తుతం బలవంతంగా లాక్కునేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపిస్తూ గ్రామంలో రైతులు ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే. ఆదివారం రైతుల ఆందోళనకు సీపీఎం నాయకులు మద్దతు పలికారు. 2013 భూసేకరణ చట్టంపై గొప్పలు చెప్పుకునే కాంగ్రెస్ నాయకులు పెద్దకంజర్ల అసైన్డ్ పేదలకు న్యాయం చేసేందుకు ఎందుకు ముందుకు రావడం లేదని ప్రశ్నించారు. రైతులకు ఎలాంటి నోటీసులు జారీ చేయకుండా దౌర్జన్యంగా భూములను లాక్కునేందుకు అధికారులు ప్రయతిస్తే సహించేది లేదని హెచ్చరించారు. అనంతరం గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు.



అసైన్డ్ రైతుల ఆందోళలో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు



మెదక్ సీఎస్ఐ చర్చిలో భక్తుల ప్రార్థనలు

మెదక్ సీఎస్ఐ చర్చిలో ఆదివారం సందడి నెలకొన్నది. ప్రెసిబేటరీ ఇన్‌చార్జి శాంతయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రార్థనల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉదయమే శిలువ ఆరాధన కార్యక్రమాన్ని నిర్వహించి, ప్రతిష్ఠించిన అనంతరం ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం భక్తులకు మత గురువులు ఆశీర్వచనాలు అందజేశారు.

-మెదక్ కల్చరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి)



కోటి లింగాలకు భక్తిశ్రద్ధలతో స్వాగతం

వచ్చే నెల 4 నుంచి 13 వరకు కాశీలో నిర్వహించనున్న కోటి పార్థివ శివలింగార్చన, నిమజ్జన మహోత్సవానికి రాష్ట్రం నుంచి ఊరూర కోటి శివలింగాలను తరలిస్తున్నారు. కాశీకి కోటి లింగాల తరలింపు యాత్రను ఆదివారం తూప్రాన్, చేగుంట పట్టణాల్లో నిర్వహించారు. భక్తులు కోటిలింగాల యాత్రకు భక్తిశ్రద్ధలతో స్వాగతం పలికారు.

-తూప్రాన్/చేగుంట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి)

టపాసుల వ్యాపారులు నిబంధనలు పాటించాలి

● నర్సాపూర్ మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్


జగ్జీవన్, మున్సిపల్ కమిషనర్

నారాయణఖేడ్, అక్టోబరు27: దీపావళి పండుగ సందర్భంగా నారాయణఖేడ్ మున్సిపల్‌పరిధిలో టపాకాయల దుకాణాలను ఏర్పాటు చేసుకునే వారు నిబంధనలకు అనుగుణంగానడుచుకోవాలని మున్సిపల్ కమీషనర్‌జగ్జీవన్ కోరారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ టపాకాయల దుకాణాలను ఏర్పాటు చేసుకునే వారు విధిగా అనుమతులు పొంది, నిబంధనలు పాటించాలన్నారు. జనవాసాలమధ్య దుకాణాలు ఏర్పాటు చేయరాదన్నారు. ప్రతి దుకాణం వద్ద 200 లీటర్ల డ్రమ్ములోనీటి నిల్వ ఉంచుకోవాలన్నారు. రెండు ఇసుక బస్తాలను సిద్ధంగాఉంచుకోవాలన్నారు. నిబంధనలు పాటించకుండా టపాకాయల దుకాణాలు ఏర్పాటుచేస్తే చట్టపరమైనచర్యలు తప్పవన్నారు.

భవనం నిర్మించారు.. యంత్రాలు మరిచారు..!

● రూ.2 కోట్లతో ఆధునిక దోభీఘాట్ పనులు అయ్యేదెప్పుడో..?

నర్సాపూర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఏడాది క్రితం రెండుకోట్లతో చేపట్టిన పనులు మధ్యలోనే నిలిచిపోవడంతో ఆధునిక దోభీ ఘాట్ పనులు పూర్తయ్యేదెన్నడోనని స్థానిక రజకులు ఎదురుచూస్తున్నారు. మెదక్ జిల్లా నర్సాపూర్ పట్టణంలోని చెరువు సమీపంలో దోభీఘాట్‌లో పాత పద్ధతిలో బట్టలు ఉతుకుతున్నారు. వారికి ఆ శ్రమ విముక్తి కల్పించి ఆధునిక వాషింగ్ మెషిన్లు ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో ఏడాది క్రితం ప్రస్తుత పాత దోభీఘాట్ సమీపంలోనే ఎకరా స్థలంలో రూ.2 కోట్లతో పనులు చేపట్టారు. కానీ భవనాన్ని అసంపూర్తిగా నిర్మించి వదిలేశారు. గతేడాది అక్టోబరులోనే ఈ ఆధునిక దోభీఘాట్‌కు శంకుస్థాపన చేయగా.. అందుకు సంబంధించిన పనులు సాగుతూ మొన్నటివరకు ప్రహరీ, భవనం పూర్తి చేశారు. కానీ భవనంలో ఆధునిక పెద్ద వాషింగ్‌మెషిన్లు ఏర్పాటు చేయడంలో తీవ్ర జాప్యం జరుగుతుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రత్యేక నిధుల ద్వారా మంజూరైన ఈ ఆధునిక దోభీ ఘాట్.. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో అందుకు కేటాయించిన నిధులు నిలిచిపోవడంతో యంత్రాల ఏర్పాటు చేయడం లేదని అంటున్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ నాయకులు చొరవ తీసుకుని నిలిచిపోయిన నిధులను తిరిగి వచ్చేలా చేసి రజకులకు ఎంతో ఉపయోగకరమైన ఈ ఆధునిక దోభీ ఘాట్‌ను వినియోగించుకునేలా చూడాలని కోరుతున్నారు. ఈ ఆధునిక దోభీఘాట్ పూర్తయితే ఇక్కడి రజకులకు పని ఎంతో సులువు అవుతుందన్నారు.


యంత్రాలు ఏర్పాటు చేయక నిరుపయోగంగా ఉన్న ఆధునిక దోభీఘాట్

సంజీవన్‌రావుపేట పీఏసీఎస్ సీఈవో సస్పెన్షన్

నారాయణఖేడ్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): నిధుల దుర్వినియోగానికి సంబంధించి మండల పరిధిలోని సంజీవన్‌రావుపేట సీడెడ్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సీఈవో మహేష్ రెడ్డిని సస్పెండ్ చేస్తూ జిల్లా సహకార అధికారి కిరణ్‌కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. 2023-2024 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నిర్వహించిన ఆడిట్‌లో రూ.5 లక్షల 94 వేల 691 నిధులను దుర్వినియోగం చేసినట్లు బహిర్గతమైనట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దుర్వినియోగమైన నిధులను రికవరీ చేయనున్నట్లు జిల్లా సహకార అధికారి తెలిపారు.

నవంబరు 2న ఉమ్మడి జిల్లా యోగా ఎంపికలు

సిద్దిపేట కల్చరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : నవంబరు 2వ తేదీన పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఉమ్మడి మెదక్ జిల్లా యోగా సెలక్షన్స్ నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ సౌందర్య తెలిపారు. జిల్లా విద్యాశాఖ ఆదేశానుసారం మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాకు చెందిన అండర్-14, 17 విభాగంలో విద్యార్థులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. నవంబరు 2న సిద్దిపేటలోని టీటీసీ భవన్‌లో జరిగే ఈ సెలక్షన్స్‌కు ఆసక్తిగల విద్యార్థులు ఒరిజినల్ బోనాఫైడ్‌తో హాజరుకావాలని సూచించారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

మిరుదొడ్డి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మిరుదొడ్డి మాజీ సర్పంచ్ కిష్టయ్య అన్నారు. ఆదివారం మిరుదొడ్డిలో ఆయన మాట్లాడారు. గ్రామాలను అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడానికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తున్నారని పేర్కొన్నారు.

యువత పొగాకు దూరంగా ఉండండి

● సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్


సంగారెడ్డిలో ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే చింతాప్రభాకర్

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి) : యువత పొగాకు దూరంగా ఉండాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతాప్రభాకర్ కోరారు. సంగారెడ్డిలోని ప్రభుత్వ ఆస్పత్రి వద్ద పొగాకు నియంత్రణ ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. పొగాకు వాడకంతో అనారోగ్య సమస్యలు వస్తాయని, పొగాకు రహిత సమాజం కోసం యువత ముందుకు రావాలని సూచించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పొగాకు నియంత్రణ సూపర్‌వైజర్ విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు వ్యాసరచన పోటీలు


పోలీసులకు నిర్వహిస్తున్న వ్యాసరచన పోటీలు

సంగారెడ్డి క్రైం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరువీరుల ప్రాణత్యాగాలను స్మరిస్తూ అక్టోబరు 21 నుంచి 31 వరకు ఫ్లాగ్‌డే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు అధికారులకు, సిబ్బందికి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సమాజంలో 'పోలీసు ప్రతిష్ఠను మెరుగుపరచడంలో నా పాత్ర' అనే అంశంపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. జిల్లాస్థాయిలో ఉత్తమంగా నిలిచిన మూడు వ్యాసాలు రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తామని సంగారెడ్డి ఎస్పీ రూపేష్ తెలిపారు. అదేవిధంగా వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు విచక్షణతో కూడిన ఫోన్ వాడకం, తెలంగాణను డ్రగ్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో నా పాత్ర అనే అంశాలపై రాసిన వ్యాసాల్లో ఉత్తమంగా నిలిచిన వ్యాసాలను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు.

క్రైం కార్నర్

విష పురుగు కాటుతో యువకుడి మృతి


కిషన్(ఫైల్)

కుకునూరుపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): విష పురుగు కాటుకు యువకుడు మృతి చెందాడు. కుకునూరుపల్లి మండలం లకుడారం గ్రామానికి చెందిన గట్టు కిషన్(27) పశువులకు మేత వేసేందుకు పొలం దగ్గరికి వెళ్లాడు. మేత వేస్తున్న క్రమంలో గుర్తు తెలియని విషపు పురుగు కాటు వేసింది. ఇంటికి వచ్చిన కిషన్ కాళ్లు మంటలు వస్తున్నాయని పడుకున్నాడు. కొద్దిసేపటి తర్వాత కుటుంబసభ్యులు లేపగా..లేవకపోవడంతో అనుమానం వచ్చి సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. కాగా రెండేళ్ల క్రితం మృతుడి తండ్రి మృతిచెందగా.. తల్లి కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతోంది. కుటుంబాన్ని కంటికి రెప్పలా కాపాడుకుంటున్న కిషన్ మృతితో ఆ కుటుంబం అనాథగా మారింది. మృతుడికి భార్య కవిత, కుమారుడు వర్షిత్(7), కూతురు నక్షత్ర(5) ఉన్నారు. కిషన్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు వేడుకుంటున్నారు.

మార్కులు తక్కువ వస్తాయని విద్యార్థి ఆత్మహత్యాయత్నం


చికిత్స పొందుతున్న వరుణ్‌తేజ్

కౌడిపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పరీక్షల్లో మార్కులు తక్కువగా వస్తే తండ్రి కొడతాడన్న భయంతో విద్యార్థి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కౌడిపల్లి మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన వరుణ్‌తేజ్ కౌడిపల్లిలోని తెలంగాణ గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. ఈ మధ్య నిర్వహించిన ఎస్‌ఏ పరీక్షలో మార్కులు తక్కువగా వస్తే తన తండ్రి కొడతాడనే భయంతో శనివారం రాత్రి 7.30 గంటలకు స్టడీ అవర్‌లో స్నేహితుల ముందే ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని స్నేహితులు వెంటనే ఉపాధ్యాయులకు తెలిపారు. వారు వెంటనే మెదక్ ప్రభుత్వాస్పత్రికి తరలించి, కుటుంబసభ్యులకు సమాచారమందించారు. ప్రస్తుతం విద్యార్థి పరిస్థితి నిలకడగానే ఉన్నది.

దాడికి పాల్పడిన 8 మందికి రిమాండ్

మద్దూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల పెద్దమనషుల సమక్షంలో చోటుచేసుకున్న పంచాయతీని మనసులో పెట్టుకుని ద్విచక్ర వాహనంపై వస్తున్న ఇరువురిపై కర్రలు, రాడ్లతో దాడికి పాల్పడిన 8 మందిపై కేసు నమోదైంది. ఈ సంఘటన మద్దూరు మండల కేంద్రంలో శనివారం రాత్రి చోటు చేసుకున్నది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా హుస్నాబాద్ ఏసీపీ సతీష్ ఆధ్వర్యంలో చేర్యాల సీఐ శ్రీను, హుస్నాబాద్ సీఐ శ్రీనివాస్, చేర్యాల ఎస్‌ఐ నీరేష్, కొమురవెల్లి ఎస్‌ఐ రాజు, అక్కన్నపేట ఎస్‌ఐ విజయ్‌భాస్కర్‌తో పాటు స్పెషల్‌పార్టీ పోలీసులు ఆదివారం పికెటింగ్ నిర్వహించారు. ఈ విషయమై ఎస్‌ఐ షేక్ మహబూబ్ తెలిపిన వివరాల ప్రకారం.. మద్దూరు గ్రామానికి చెందిన చిలుక సతీష్ తన స్నేహితుడు దామెర విజయ్‌తో రాత్రి సుమారు 8.30 గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై ఊర్లోంచి కాలనీకి వస్తున్నాడు. ఆ సమయంలో వాటర్ ప్లాంట్ సమీపంలో సుమారు 8 మంది అడ్డుకుని కర్రలు, రాడ్లతో కొట్టగా.. ఇరువురి తలలకు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు వెంటనే చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. దాడిచేసిన చిలుక లచ్చయ్య, చిలుక రాజు, చిలుక రాంబాబు, చిలుక పరశురాములు, చిలుక బాబు, చిలుక మురళి, చిలుక ప్రేమ్‌కుమార్, చిలుక మురళి తన కుమారుడు చిలుక సతీష్‌ను చంపేందుకు ప్రయత్నించరంటూ తండ్రి చిలుక దశరథం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని 8 మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

న్యూస్ బాక్స్

నేడు మంత్రి దామోదర్ రాక

రేగోడు అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సోమవారం రేగోడు మండలంలో పర్యటించినట్లు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దిగంబరరావు తెలిపారు. బోరంచ ఎత్తిపోతల పథకం అదనపు పనుల నిర్మాణం, రేగోడు చౌదరిపల్లి, కొత్వాల్‌పల్లి, పెద్ద శంకరంపేట మండలంలోని బద్దారం, బుజరంపల్లి తదితర చెరువులకు సింగూర్ జలాలను నింపుటకు పైప్‌లైన్ నిర్మాణానికి భూమి పూజ చేయనున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం టి లింగంపల్లిలో ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతారని తెలిపారు.



పటాన్‌చెరులోని ఇండస్ట్రీయల్ పార్కు ఏరియా

పరిశ్రమల మనుగడ ప్రశ్నార్థకం..

- కార్మికుల కొరతతో చతికిల
- ఆర్డర్లున్నా అందించలేని వైనం
- ఉత్తరాది రాష్ట్రాల నుంచి కార్మికుల దిగుమతి
- 50 శాతం ఉత్పత్తితో నెట్టుకొస్తున్న యాజమాన్యాలు

పటాన్‌చెరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉపాధిరంగంలో సింహ భాగం చిన్న, సూక్ష్మ తరహా పరిశ్రమలే కీలక పాత్ర పోషిస్తున్నాయి. వీటికి స్వర్గధామంలా విలసిల్లే సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పారిశ్రామికవాడ ప్రస్తుతం అంపశయ్యపై కొట్టుమిట్టాడుతోంది. గతంలో కరెంటు సమస్యలు, తరువాత జీఎస్టీ, వెంటనే కొవిడ్ ఇలా ఎప్పుడూ ఏదో ఒక సంక్షోభంతో పరిశ్రమలు చతికిపోతున్నాయి. మహారత్న హోదా ఉన్న బీహెచ్ఈఎల్, బీడీఎల్, ఓడీఎఫ్ తదితర భారీ పరిశ్రమల నుంచి వచ్చే వందల కోట్ల ఆర్డర్లతో పాటు వేలాదిమంది కార్మికులతో కళకళలాడే పారిశ్రామికవాడలో నేడు నిశ్శబ్దం రాజ్యమేలుతోంది. కేవలం ఒక్క బీహెచ్ఈఎల్‌కు అనుబంధంగా 1,500 పరిశ్రమలు ఉంటే నేడు వందలోపునకు పడిపోవడం దుస్థితికి అద్దం పడుతోంది. ఇప్పుడే సమస్యల నుంచి బయటపడి పరిశ్రమల నుంచి ఆర్డర్లు వస్తున్నా నైపుణ్యం లేని కార్మికుల కొరతతో చిన్న పారిశ్రామికవేత్తలు చతికిలపడిపోతున్నారు.

పరిశ్రమల్లో పనికి మొగ్గుచూపని యువత

పరిశ్రమల్లో పనిచేసేందుకు యువత ముందుకు రావడం లేదు. పెరిగిన జీవన వ్యయం, ఆ స్థాయిలో ఫ్యాక్టరీల్లో అందని జీతాల వల్ల ఉపాధి కోసం పారిశ్రామికవాడ వైపు వచ్చేవారి సంఖ్య క్రమంగా తగ్గిపోతోంది. చిన్న పరిశ్రమలు పెద్ద సంఖ్యలో ఉన్న పటాన్‌చెరు, పాషమైలారం, ఐడీఏ బొల్లారం, అశోక్‌నగర్ తదితర పారిశ్రామికవాడల్లో పరిశ్రమల గేట్లకు 'కార్మికులు కావలెను' అనే బోర్డులు వేలాడుతున్నాయి. ఒకప్పుడు తెలంగాణ నలుమూలలతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతి జిల్లా నుంచి కార్మికులు ఉపాధి కోసం పటాన్‌చెరు పారిశ్రామికవాడకు తరలివచ్చేవారు. ప్రస్తుత యువత, నైపుణ్యం ఉన్న కార్మికులు పరిశ్రమల్లో పనిచేసేందుకు రావడం లేదు. దీంతో యజమానులు ఛత్తీస్‌ఘడ్, యూపీ, బీహార్, ఒరిస్సా నుంచి కార్మికులను ముందస్తు ఒప్పందాలతో రప్పించుకుంటున్నారు. అందుకు ప్రత్యేక ఏజెన్సీలు పనిచేస్తున్నాయి. ఒకవైపు ఆర్డర్లు వస్తున్నా చిన్నపరిశ్రమల్లో కార్మికుల కొరతతో సకాలంలో ఉత్పత్తులను అందించలేక పరిశ్రమలను మూసివేసుకునే పరిస్థితి ఏర్పడింది. పటాన్‌చెరు పారిశ్రామికవాడలో చిన్న తరహా పరిశ్రమలు కేవలం 50 శాతం కార్మికులతో ఉత్పత్తి కొనసాగిస్తున్నారు. ఇంజనీరింగ్, ప్లాస్టిక్, అల్లాయిస్ పరిశ్రమల్లో పని చేసే స్కిల్డ్, అన్‌స్కిల్డ్ కార్మికుల బీహార్, ఛత్తీస్‌ఘడ్, ఉత్తర్ ప్రదేశ్, బెంగాల్, ఒరిస్సా రాష్ట్రాలకు చెందిన వారే ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. స్థానిక యువకులు ఎవరూ పరిశ్రమల్లో పనిచేసేందుకు ముందుకు రావడం లేదు. పరిశ్రమల్లో పరిస్థితిని గమనించిన ఆయా పారిశ్రామికవాడల్లోని టీఎస్ ఐఐసీ సర్వీస్ సొసైటీలు రంగంలోకి దిగాయి. ఏకంగా వాట్సాప్ నెంబర్లు ఇచ్చి ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచిస్తున్నా స్పందన కనిపించడం లేదు. పారిశ్రామికవాడల్లో ప్రస్తుతం వేల సంఖ్యలో ఉద్యోగాలు ఖాళీ ఉన్నాయని పేర్కొంటున్నారు. బీటెక్ మెకానికల్, కంప్యూటర్, పాలిటెక్నిక్, ఐటీఐ నిరుద్యోగులకు పెద్ద ఎత్తున ఉద్యోగాలు లభించే అవకాశాలున్నాయి. వాటితోపాటు సీఎన్‌సీ మిషన్లను నడిపేందుకు ప్రోగ్రాం ఆపరేటర్లు, ఇంటర్, ఎస్ఎస్‌సీ, మొదలుకొని బీఎస్సీ, బీఏ, బీకాం విద్యార్థులకు సైతం ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. జిల్లా పరిశ్రమలశాఖ, ఉపాధి కేంద్రాల ద్వారా ఉద్యోగాలకు పిలుపు ఇచ్చినా స్పందన కరువైంది. సాధారణ వేతనాలకంటే ఎక్కువగా ఇస్తామని చెబుతున్నా యువత ముందుకు రాని దుస్థితి ఏర్పడింది.

స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలను విస్తరించాలి



సమస్యల్లో ఉన్న చిన్నపరిశ్రమలను ఆదుకునేందుకు గత ప్రభుత్వాలు ప్రకటించిన సబ్సిడీలను ఇంతవరకూ చెల్లించలేదు. పాత పరిశ్రమలను ఆదుకోనంత వరకు కొత్త పరిశ్రమలకు సబ్సిడీలను ప్రకటించినా లాభం లేదు. పరిశ్రమలు పెట్టేందుకు వచ్చే ఔత్సాహికులను మంచి వేదికను ప్రభుత్వమే ఏర్పాటుచేయాలి. ప్రస్తుతం ఆర్డర్లు ఆశాజనకంగా వస్తున్నా కార్మికుల కొరత తీవ్రంగా ఉంది. స్థానిక యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ కింద శిక్షణ ఇప్పించాలి. ఐటీఐలను పారిశ్రామికవాడలకు అనుబంధంగా ఏర్పాటు చేయాలి. ఉపాధి కల్పనలో కీలకపాత్ర పోషిస్తున్న చిన్న, సూక్ష్మ పరిశ్రమలను కాపాడుకోవాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉంది.

-గోకుల్‌శ్రీధర్, బీహెచ్ఈఎల్ ఆన్సలరీ పరిశ్రమల సంఘం అధ్యక్షుడు

ప్రత్యామ్నాయాల వైపు యువత చూపు

గ్రామాల్లో నీటి వసతి పెరగడం, వ్యవసాయ అనుబంధ రంగాలు ఊపందుకోవడం, రియల్ ఎస్టేట్ వ్యాపారం వల్ల భూముల ధరలు పెరగడంతో యువత రూ.20 వేల లోపు జీతం ఇచ్చే చిన్న పరిశ్రమల్లో పనిచేయడం లేదు. పట్టణాల్లో మాల్స్‌లో పనిచేసే యువత సంఖ్య పెరిగింది. స్విగ్గీ, జోమాటో తదితర ఆన్‌లైన్ సేవలందిస్తూ ఆడుతూ పాడుతూ సంపాదించేందుకు మొగ్గుచూపుతున్నారు. ఓలా, ఊబర్ క్యాబ్‌లు నడుపుతూ ప్రత్యామ్నాయ ఉపాధి రంగాల వైపు చూస్తున్నారు. ఇక బీటెక్‌లో ఐటీ, సీఎస్‌సీ, ఎలక్ట్రానిక్స్ విభాగాల్లో పట్టాలు పొందిన యువత సాఫ్ట్‌వేర్ వైపు వెళ్తున్నారు. దీంతో ఉత్తరాది రాష్ట్రాల నుంచి తక్కువ వేతనాలకు పనిచేసే వారిని కాంట్రాక్టు పద్ధతుల్లో తెచ్చి తాత్కాలిక షెడ్లు వేసి ఉత్పత్తిని కొనసాగిస్తున్నారు.



పటాన్‌చెరు పారిశ్రామిక వాడలో కార్మికులు కావాలని పరిశ్రమలు ఎదుట ఏర్పాటు చేసిన బోర్డు

గడువు పదిరోజులే...

5వ పేజీ తరువాయి

ఏర్పాటు చేసినా అంతంతమాత్రంగానే వస్తున్నారు.

ప్లీజ్.. ఫారం నింపండి అంటూ..

ప్రస్తుతం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ రేసులో 10 మంది దాకా ఆశావహులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. గ్రాడ్యుయేట్ల ఓట్లతోనే వీరి గెలుపోటములు ఆధారపడి ఉన్నందున తమ ఆధ్వర్యంలోనే ఓట్లు నమోదైతే తమకు విశ్వాసం ఉంటుందని అనుకుంటున్నారు. అందుకే పట్టభద్రుల్లో చైతన్యం తెచ్చేలా ఫ్లెక్సీలు కడుతున్నారు. సోషల్ మీడియా, వాట్సాప్, ఫేస్‌బుక్‌ల ద్వారా ఓటు హక్కు నమోదు చేసుకోవాలని కోరుతున్నారు. గ్రాడ్యుయేట్ పూర్తిచేసి అర్హత ఉన్నవారి ఫోన్‌నంబర్లు తీసుకొని ఎన్‌రోల్‌మెంట్ పూర్తిచేయాలని అడుగుతున్నారు. నియోజకవర్గం, జిల్లా కేంద్రాల్లో ప్రత్యేకంగా కార్యాలయాలు తెరిచి ఫారం-18లను పంపిణీ చేస్తున్నారు. కొందరైతే ఇంకో అడుగు ముందుకేసి పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి ఫారం నింపాలని వేడుకుంటున్నారు. పట్టభద్రుల డిగ్రీ, ఆధార్, ఓటరు ఐడీ జిరాక్స్ పత్రాలు సేకరిస్తూ ఫారంలపై వారి సంతకాలు తీసుకొని ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా ఆశావహులే అప్లయ్ చేస్తున్న పరిస్థితి నెలకొంది. గడువు సమీపిస్తుండడంతో హడావిడి ఎక్కువైంది.

పెరగనున్న ఉపాధ్యాయుల ఓట్లు..

కరీంనగర్- మెదక్- ఆదిలాబాద్- నిజామాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి 2019లో సుమారు 21వేల ఓట్లు ఉన్నాయి. అయితే ఆ సంఖ్య మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. 1-11-2018 నుండి 31-10-2024 వరకు హైస్కూళ్లు, ఆపైన ప్రభుత్వ విద్యాసంస్థల్లో 3 సంవత్సరాలపై బోధన చేస్తున్న ఉపాధ్యాయులు ఓటు హక్కుకు అర్హులు. హైస్కూళ్లు, జూనియర్, డిగ్రీ కళాశాలలు, గురుకులాలు, మాడల్, కస్తూరిబా పాఠశాలలు, ప్రభుత్వ ఇంజనీరింగ్, మెడికల్, ఇతర ఉన్నత విద్యాసంస్థల్లో పనిచేసే అర్హులైన వారందరికీ ఓటు హక్కు పొందే అవకాశం ఉంది. ఇక విద్యాశాఖ నిబంధనల ప్రకారం వేతనాలు పొందే ప్రైవేట్ విద్యా సంస్థల్లో విధులు నిర్వహించే ఉపాధ్యాయులు కూడా అర్హత పొందవచ్చు. గడిచిన ఆరేళ్ల వ్యవధిలో ప్రభుత్వ విద్యాసంస్థలు పెద్ద సంఖ్యలో నెలకొల్పబడ్డాయి. ఉపాధ్యాయులు, అధ్యాపకులూ రిక్రూట్ అయ్యారు. అందుకే ఉపాధ్యాయ ఓటర్ల సంఖ్య 50వేల మార్కును చేరుకునే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఏదేమైనప్పటికీ గతం కంటే భిన్నంగా ఓటర్ల నమోదుపై ఆశావహులు దృష్టి పెట్టారు. ఎన్నికల నిర్వహణకు మరో ఐదు నెలల సమయం ఉన్నప్పటికీ ప్రచారంలో వెనక్కు తగ్గడం లేదు. ఫలితంగా రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికలు రసవత్తరంగా ఉంటాయనే సంకేతాలు కనిపిస్తున్నాయి.


గుమ్మడిదల, అన్నారం గ్రామాల సమీపంలో మెదక్-హైదరాబాద్ రోడ్డుపై జీవాలను తరలిస్తున్న గొర్రెల కాపరులు

మేతకు.. మెతుకుసీమకు..

- మహబూబ్‌నగర్ నుంచి వేల సంఖ్యలో జీవాల వలసలు

గుమ్మడిదల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి కోసం ప్రజలు ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి వలసలు పోవడం సహజం. అయితే మేత కోసం మూగజీవాలు కూడా ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి వలస పోకతప్పడం లేదు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నారాయణపేట ప్రాంతంలో జీవాలకు మేత లేకపోవడంతో మెతుకు సీమగా పేరుగాంచిన మెదక్ జిల్లాకు వేల సంఖ్యలో జీవాలను తరలిస్తున్నారు. జీవాలను తరలించడంలో గొర్రెలకాపరులు పడుతున్న కష్టాలు వర్ణణాతీతం. వందల కిలోమీటర్లు ఉన్న నారాయణపేట మండలం నుంచి మెదక్ జిల్లాకు కాలినడకన వెళ్తే వారంరోజులు పడుతుందని చెబుతున్నారు. ఉదయం సద్ది సంకనేసుకుని బయలుదేరి గొర్రెలను మేపుకుంటే కిలోమీటర్లు వెళ్తామంటున్నారు. రాత్రి అయితే ఎక్కడపడితే అక్కడ బస చేస్తారు. ప్రధాన రహదారిపై గొర్రెలను తరలించాలంటే ఎన్నో కష్టాలు పడాల్సి వస్తుంది. రోడ్డుపై వాహనాలు రాకపోకలు సాగించడంతో జీవాలు బెదిరిపోతున్నాయి. ఎండకు, వానకు తట్టుకుని జీవాలను పోషించి, అమ్మినప్పుడు వచ్చిన డబ్బులతో కుటుంబాన్ని పోషించాల్సిందేనని అంటున్నారు. రెండునెలలు మెదక్ జిల్లాలో, ఆ తర్వాత ఖమ్మం నుంచి తిరిగి సొంతూరికి వెళ్తామని వారు చెబుతున్నారు.

వేతన ఒప్పందం అభినందనీయం

- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు


బొంతపల్లి పారిశ్రామికవాడలో జరిగిన వేతన ఒప్పంద అభినందన సభలో మాట్లాడుతున్న చుక్క రాములు

గుమ్మడిదల/గజ్వేల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): బొంతపల్లి పారిశ్రామికవాడలోని న్యూ లాండ్ పరిశ్రమ కార్మికులకు చరిత్రాత్మక వేతన ఒప్పందం చేయడం అభినందనీయమని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు అన్నారు. ఆదివారం న్యూల్ లాండ్ పరిశ్రమ కార్మికులు ఏర్పాటు చేసిన వేతన ఒప్పంద అభినందన సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పరిశ్రమలో వేతనం ఒప్పందం కార్మికుల ఐక్యతతో చేశారన్నారు. రూ.14 వేల వేతనంతో పాటు ఇతర సౌకర్యాలు వేతన ఒప్పందంలో సాధించామని పేర్కొన్నారు. కార్మికులకు నిత్యం సీఐటీయూ అండగా ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బీ.మల్లేష్, రాష్ట్ర కమిటీ సభ్యుడు కే.రాజయ్య, యూనియన్ జనరల్ సెక్రటరీ వెంకటేష్, నాయకులు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. ప్రజా ఉద్యమాల్లో సీపీఎం పాత్ర కీలకమని ఆ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చుక్క రాములు అన్నారు. గజ్వేల్ పట్టణంలోని ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటుచేసిన ఆహ్వాన సంఘం సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఎర్రజెండా దేశవ్యాప్తంగా భూఉద్యమాలు, రైతాంగ, కార్మిక పోరాటాల నిర్వహించిందని తెలిపారు. డిసెంబరు 1, 2 తేదీల్లో గజ్వేల్ పట్టణంలో సీపీఎం జిల్లా మూడో మహాసభలను నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సందబోయిన ఎల్లయ్య, గోపాలస్వామి, శశిధర్, భాస్కర్, సత్తిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు, సీపీఎం గజ్వేల్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రొటోకాల్ విస్మరించడంపై స్పీకర్‌కు ఫిర్యాదు చేస్తా: ఎమ్మెల్యే

నర్సాపూర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన మెదక్‌లో ఈ మధ్య ప్రారంభించిన మెడికల్ కాలేజీకి ఉమ్మడి జిల్లాలోనే సీనియర్ ఎమ్మెల్యేగా ఉన్న తనను ఆహ్వానించకుండా ప్రొటోకాల్ విస్మరించారని, ఈ విషయమై స్పీకర్‌కు ఫిర్యాదు చేస్తానని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే సీఎం కేసీఆర్ మెదక్‌లో వంద సీట్ల మెడికల్ కాలేజీ ఏర్పాటు చేశారని, దానిని కుదించి 50 సీట్లకు చేసి ఈనెల 24న మంత్రులు కొండా సురేఖ, దామోదర్ రాజనర్సింహాలు ప్రారంభించారన్నారు. ఈ ప్రారంభోత్సవానికి మెదక్ జిల్లాలో ఉన్న రెండు నియోజకవర్గాల్లో ఒకటైన నర్సాపూర్ ఎమ్మెల్యేగా ఉన్న తనను అధికారులు ఆహ్వానించకుండా అవమానించారన్నారు. అదే అధికార కాంగ్రెస్‌కు చెందిన ఏ హోదా లేని నాయకులను మాత్రం వేదికపై కూర్చోబెట్టి మర్యాదలు చేశారన్నారు. అలాగే హత్నూర మండలం దౌల్తాబాద్‌లో పీహెచ్‌సీ ప్రారంభోత్సవంలో కూడా ప్రొటోకాల్ విస్మరించారన్నారు. ప్రొటోకాల్ ఉల్లంఘన విషయమై త్వరలోనే స్పీకర్‌కు ఫిర్యాదు చేస్తానని చెప్పారు. అదేవిధంగా అసెంబ్లీ సమావేశాల్లో తనకు జరుగుతున్న అగౌరవాన్ని ప్రస్తావిస్తానని పేర్కొన్నారు.

రూ.3.60 లక్షల గంజాయి మొక్కలు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న గంజాయి మొక్కలను చూపుతున్న ఎక్సైజ్ శాఖ పోలీసులు

వట్‌పల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్న సంఘటన సంగారెడ్డి జిల్లా పరిధిలోని నీర్జప్ల గ్రామంలో ఆదివారం చోటు చేసుకున్నది. ఎక్సైజ్ సీఐ సాగర్ రెడ్డి, ఎస్‌ఐ విజయ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కుమ్మరి చంద్రయ్య పత్తి చేనులో 28, పెద్దగొల్ల మొగులయ్య పత్తి చేనులో 8 గంజాయి మొక్కలు సాగుచేస్తున్నారని తెలిసి స్వాధీనం చేసుకున్నామన్నారు. వీటి విలువ రూ.3.60 లక్షలు ఉంటుందని చెప్పారు. ప్రస్తుతం నిందితులు పరారీలో ఉన్నారు. ఈ దాడుల్లో ఎస్‌ఐ సందీప్, కానిస్టేబుల్స్ విక్రమ్, సాయిలు, చౌదరి, ముఖి పంచాయతీ కార్యదర్శులు బీరప్ప, జయంతి పాల్గొన్నారు.

క్రైం కార్నర్

'తుఫాన్' బోల్తా, 11 మందికి గాయాలు

- ఇద్దరి పరిస్థితి విషమం

కల్హేర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దేవునిపల్లి, బాచేపల్లి గ్రామాల మధ్య 161 జాతీయ రహదారిపై ఆదివారం తుఫాన్ బోల్తాపడిన సంఘటనలో 11 మందికి గాయాలు కాగా.. ఇందులో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నది. మహారాష్ట్రలోని దెగ్లూర్‌తో పాటు కామారెడ్డి జిల్లా బిచ్కుంద, పిట్లం మండల కేంద్రాల నుంచి 18 మంది ప్రయాణీకులతో హైదరాబాద్ వెళ్తున్న (ఏపీ 23 ఎక్స్ 7451) నంబరు గల తుఫాన్ వాహనం వేగంగా వెళ్తూ.. 161వ జాతీయ రహదారిపై బోల్తాపడింది. ఈ ఘటనలో 11 మందికి గాయాలు కాగా.. ఇందులో వడగామకు చెందిన దీపాళి(12), దెగ్లూర్ బరాళికి చెందిన బరాళిస్వాయి(9) అనే బాలికల పరిస్థితి విషమంగా ఉన్నది. గాయాలపాలైన బాలికల తల్లిదండ్రులను సంగారెడ్డి ఆస్పత్రికి, మిగిలిన ఏడుగురిని నారాయణఖేడ్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. డ్రైవర్ అతి వేగంగా వాహనం నడపడం వల్లే ప్రమాదం సంభవించిందని తెలిపారు.

ఆటో బోల్తాపడి ఐదుగురికి...


ఆటో ప్రమాదంలో గాయపడ్డ కూలీలు

చేర్యాల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఆటోడ్రైవర్ నిర్లక్ష్యం ఐదుగురిని గాయాలపాలు చేసింది. గేర్‌లో ఉండగానే ఆటోను స్టార్ట్ చేయడంతో అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో పలువురికి గాయాలవగా.. మరికొందరికి ప్రాణాపాయం తప్పింది. బాధితుల వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం వేచరేణి గ్రామానికి చెందిన మాదాసు ఎల్లవ్వ, మాదాసు పోశవ్వ, మాదాసు అండవ్వ, లక్ష్మి, రాణి, శాంతమ్మ, మాదాసు లక్ష్మి, తాడూరి రేణుక, మాదాసు ప్రేమలత తదితరులు ఆదివారం కొమురవెల్లి మండలం లెనిన్‌నగర్ గ్రామంలో కూలీ పనులకు వెళ్లారు. పనులు ముగించుకున్న తరువాత సాయంత్రం ఇంటికి వెళ్లేందుకు అందరూ ఆటోలో కూర్చున్నారు. కానీ డ్రైవర్ ఆటో గేర్‌లో ఉన్న విషయాన్ని గుర్తించకుండా వెనక తాడు లాగి స్టార్ట్ చేయడంతో ఒక్కసారిగా అదుపుతప్పి దూసుకెళ్లింది. అప్రమత్తమైన పలువురు ఆటోలోంచి దూకగా.. మరికొందరు ఆటోలోనే ఉండిపోయారు. కొద్దిదూరం వరకు వెళ్లిన ఆటో బోల్తాపడింది. దీంతో మాదాసు పోశవ్వ, ఎల్లవ్వ, రాణి, అండాలు, లక్ష్మిలకు గాయాలయ్యాయి. స్థానికులు వారిని హుటాహుటిన చేర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బలంగా గాయాలైనవారిని మెరుగైన వైద్యం కోసం సిద్దిపేటకు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



గాయపడ్డ స్వప్న, సహర్ష్

చేర్యాల మండలం ముస్త్యాల గ్రామశివారులో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయాలపాలయ్యారు. జనగామ జిల్లా కేంద్రానికి చెందిన శ్రీకాంత్, తన భార్య స్వప్న, కుమారుడు సహర్ష్‌తో కలిసి కారులో సిద్దిపేటలో జరిగే శుభకార్యానికి వెళ్తున్నాడు. మార్గమధ్యలోని ముస్త్యాల శివారులో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో ముగ్గురికి తీవ్రగాయాలు కావడంతో అంబులెన్స్‌లో చేర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి, అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం సిద్దిపేట ఆస్పత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో మద్యం దుకాణం దగ్ధం

జహీరాబాద్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన మొగుడంపల్లిలో గల రేణుకా ఎల్లమ్మ మద్యం దుకాణంలో ఆదివారం ఉదయం 7 గంటలకు విద్యుదాఘాతం ఏర్పడి షాపు దగ్ధమైంది. దుకాణం నుంచి పొగలు రావడాన్ని గమనించిన స్థానికులు నిర్వాహకులకు ఫోన్‌చేసి సమాచారమందించారు. వారు అగ్నిమాపకశాఖకు తెలపగా.. వారు వచ్చి మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినా.. అప్పటికే దుకాణం మొత్తం దగ్ధమైంది. దుకాణంలో రూ.1 కోటి విలువ చేసే మద్యం దగ్ధమైనట్లు యజమానులు తెలిపారు.

పాలకుల నిర్లక్ష్యం..
ప్రజలకు శాపం

- అధ్వానంగా చల్మెడ- రాంపూర్ రహదారి
- ఏడాదిన్నర క్రితం రూ.12 కోట్లు మంజూరు
- కంకర వేసి వదిలేయడంతో తిప్పలు
- నిజాంపేట మండలంలో రోడ్ల దుస్థితిని పట్టించుకోని అధికారులు, పాలకులు

నిజాంపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులను హడావిడిగా ప్రారంభించి అసంపూర్తిగా వదిలేయడం ప్రజల పాలిట శాపంగా పరిణమిస్తున్నది. నిజాంపేట మండలంలో రహదారి పనులు ముందుకు సాగక అసంపూర్తి రోడ్డు పనులతో ప్రజల ఇబ్బందులు అంతా ఇంతా కాదు. కొన్నిచోట్ల కంకర వేసి వదిలేసి ఏళ్లు గడుస్తున్నా.. పనులు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా మారాయి. దీంతో రోడ్లు అధ్వానంగా మారడమే కాకుండా ప్రమాదాలకు నెలవై, వాహనదారులకు నరకాన్ని తలపిస్తున్నాయి.

రోడ్డు మరమ్మతులను పట్టించుకునేవారేరీ?

రెండున్నర దశాబ్దాల క్రితం మారుమూల పల్లెలను కలుపుతూ మండల పరిధిలోని చల్మెడ-నస్కల్ మీదుగా రాంపూర్ వరకు బీటీ రహదారి నిర్మించారు. అయితే కొన్నాళ్లుగా కిలోమీటర్ల మేర రోడ్డు పూర్తిగా ధ్వంసమై వాహన చోదకులకు ఈ రహదారి నరకాన్ని తలపిస్తున్నది. అలాగే కొన్నేళ్ల కిందట వేసిన రోడ్డు ధ్వంసమై గుంతలు ఏర్పడటంతో రహదారిపై రాకపోకలు సాగించే ఆయా గ్రామాల ప్రజలు పలుమార్లు ప్రజాప్రతినిధులకు, అధికారులకు విజ్ఞప్తులు చేశారు. స్పందన లేకపోవడంతో నిరసనలకు పూనుకున్నారు.

నిధులు మంజూరైనా..

రోడ్డు మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలంటూ అప్పటి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి, బీఆర్ఎస్ అసమ్మతి నేత పంజా విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పాదయాత్ర చేపట్టారు. ఈ నేపథ్యంలో ఏడాదిన్నర క్రితం గత ప్రభుత్వ హయాంలో రోడ్డు పునర్నిర్మాణానికి రూ.12 కోట్లు విడుదలయ్యాయి. అయితే కాంట్రాక్టర్ అక్కడక్కడా సుమారు 4 కిలోమీటర్ల మేర రోడ్డు తవ్వి గుంతలు పూడ్చి కంకర వేసి వదిలేశారు. కాగా ప్రభుత్వం నుంచి బిల్లులు రానందువల్లే రహదారి పనుల పరిస్థితి అధ్వానంగా తయారైందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకుంటే గానీ పనులు పూర్తయ్యే పరిస్థితి కనిపించడం లేదు. కనీసం ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమైనా స్పందించి ఈ రోడ్డు పనులకు మోక్షం కల్పించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



కంకర వేసి వదిలేసిన నిజాంపేట-నస్కల్ రహదారి

ప్రజల ఇబ్బందులు పట్టవా?



రహదారి సరిగా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం శోచనీయం. గతంలో పాదయాత్రలు, నిరసనలు చేస్తే హడావిడిగా రోడ్డు పునర్నిర్మాణాన్ని చేపట్టి, ఇప్పుడు ఆ రోడ్డు సంగతే మర్చిపోయారు. ప్రజలు ప్రమాదాల బారిన పడకుండా అసంపూర్తిగా నిలిచిన రోడ్డు పనులను పూర్తి చేయాలి.

- జె.స్వామి, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు

ప్రమాదాలు జరిగినా పట్టించుకోరా?



రోడ్డు బాగు చేయాలని నిరసనలు, పాదయాత్రలు చేపడితే చివరకు పనులు ప్రారంభించి ఏడాది గడిచినా ఇప్పటికీ ఎలాంటి పురోగతి లేదు. సదరు కాంట్రాక్టర్ కంకర వేసి రోడ్డును మధ్యలోనే వదిలి పెట్టాడు. వాహనదారులకు ఏమైనా ప్రమాదాలు జరిగితేగానీ అధికారులు పట్టించుకోని పరిస్థితి కనిపిస్తున్నది.

- శ్రీనివాస్‌గౌడ్, బీజేపీ జిల్లా నాయకుడు

తూప్రాన్‌లో కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి

తూప్రాన్/మనోహరాబాద్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం తూప్రాన్ శివారులో, అదేవిధంగా మనోహరాబాద్ మండలం దండుపల్లి వద్ద తూప్రాన్ సొసైటీ చైర్మన్ మెట్టు బాలకృష్ణారెడ్డితో కలిసి ఆయన వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు సన్నరకాలకు రూ. 500 చెల్లింపులు చేసేందుకు శనివారమే మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించినట్టు తెలిపారు. రైతులు సొసైటీ ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని సూచించారు. తూప్రాన్‌లో కాంగ్రెస్ నాయకులు మామిండ్ల కృష్ణ, పట్టణ అధ్యక్షుడు పల్లెర్ల రవీందర్ గుప్తా, కౌన్సిలర్ రవీందర్‌రెడ్డి, మల్లారెడ్డి, లక్ష్మారెడ్డి, అన్ను, సత్యనారాయణ, సంతోష్, జావేద్, మల్లేశ్, శ్రీహరి పాల్గొన్నారు. మనోహరాబాద్ మండలం దండుపల్లి కార్యక్రమంలో ఎస్ఐ సుభాష్‌గౌడ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మల్లారెడ్డి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సీఎంను సన్మానించిన ఎమ్మెల్యే సంజీవరెడ్డి



సీఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఖేడ్ నియోజకవర్గానికి మొదటి విడతలోనే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలను మంజూరు చేసినందుకు ఎమ్మెల్యే సంజీవరెడ్డి సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం ఎమ్మెల్యే సంజీవరెడ్డి హైదరాబాద్‌లో సీఎంను మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గ ప్రజల తరఫున శాలువాతో సన్మానించారు. అనంతరం నియోజకవర్గంలో నెలకొన్న వివిధ సమస్యల గురించి చర్చించి, నిధులు మంజూరు చేయాలని కోరుతూ, వినతిపత్రాన్ని అందించారు. వెంట నాగర్ కర్నూల్, జడ్చెర్ల ఎమ్మెల్యేలు శ్రీనివాస్‌రెడ్డి, అనిరుద్ రెడ్డి తదితరులు ఉన్నారు.

నిత్యాగ్నిహోత్రంతో ఎన్నో ప్రయోజనాలు



కద్పల్‌లో అగ్నిహోత్రంలో గ్రామస్థులు

కల్హేర్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): నిత్యాగ్నిహోత్రం నిర్వహించడం వల్ల ఎన్నో లాభాలున్నాయని, మరెన్నో సమస్యలకు పరిష్కారం లభిస్తుందని విశ్వ ఫౌండేషన్ బాధ్యుడు రుద్రప్ప పేర్కొన్నారు. ప్రతిరోజూ సూర్యోదయం, సూర్యాస్తమయం సమయాల్లో అగ్నిహోత్రం నిర్వహించాలని సూచించారు. ఆదివారం ఉదయం సిర్గాపూర్ మండల పరిధిలోని కద్పల్ గ్రామంలో రుద్రప్ప ఆధ్వర్యంలో అగ్నిహోత్ర కార్యక్రమం నిర్వహించారు. అగ్నిహోత్రం వల్ల వెలువడే వాయువులతో కాలుష్య నిర్మూలన జరుగుతుందని, మానసిక ఒత్తిడి తగ్గుతుందని ఆయన వివరించారు. కార్యక్రమంలో సిర్గాపూర్ మాజీ జడ్పీటీసి రాఘవరెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఆర్‌వోబీ పనులను త్వరగా పూర్తిచేయాలి



అర్ధాంతరంగా నిలిచిపోయిన రైల్వేఓవర్‌బ్రిడ్జి పనులు

జహీరాబాద్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): జహీరాబాద్‌లోని ఎడ్లబజార్ వద్ద నిర్మిస్తున్న రైల్వే ఓవర్‌బ్రిడ్జి (ఆర్‌వోబీ) పనులను త్వరగా పూర్తిచేయాలని ఎస్సీకార్పొరేషన్ అభివృద్ధిసంస్థ మాజీ చైర్మన్ వై. నరోత్తం పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఐదేళ్లుగా బ్రిడ్జినిర్మాణంలో జరుగుతున్న ఆలస్యంతో ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ఇబ్బందులను గుర్తించి బ్రిడ్జిపనులను త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తేవాలని ఆయన కోరారు. ఓవైపు బ్రిడ్జినిర్మాణం పూర్తి చేయక పోవడం, మరోవైపు సర్వీస్‌రోడ్డును సక్రమంగా వేయక పోవడంతో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడాల్సివస్తుందన్నారు. కాగా ఆర్‌వోబీ అంచనా విలువ రూ.90కోట్లు ఉండగా బ్రిడ్జి నిర్మాణం విలువ మాత్రం రూ.39కోట్లే ఉందన్నారు. మిగతా రూ.51 కోట్లు దేనికోసం ఖర్చుచేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. అభివృద్ధి పనులను చేపట్టడంలో పాలకులు విఫలమయ్యారని ఆయన ఆరోపించారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

శివ్వంపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో గేదె మృతి చెందిన సంఘటన సికింద్లాపూర్‌లో ఆదివారం చోటుచేసుకున్నది. గ్రామానికి చెందిన బాధిత రైతు ఏనుగు నర్సింహ్మారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని సికింద్లాపూర్‌లో పంట పొలాల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద గేదె గడ్డి మేస్తూ ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. దీంతో సుమారు రూ. లక్ష నష్టం వాటిల్లిందని రైతు వాపోయాడు.

హకీంపేట వద్ద హల్దీ వాగు పై బ్రిడ్జి నిర్మించాలి

మాసాయిపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): హకీంపేట గ్రామ సరిహద్దులో పారుతున్న హల్దీవాగుపై నెల్లూరు గ్రామం వద్ద బ్రిడ్జిని నిర్మించాలని హకీంపేట గ్రామస్థులు యువకులు ఇరిగేషన్, రెవెన్యూ అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ బ్రిడ్జి నిర్మాణంతో వెల్దుర్తి మండల కేంద్రానికి వెళ్లడానికి సుమారు 11 కిలోమీటర్ల దూరం తగ్గుతుందని గతంలో అధికారులు సర్వే నిర్వహించి వదిలేశారని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇకనైనా సర్వే నిర్వహించిన ప్రాంతం వద్ద హల్దీవాగుపై బ్రిడ్జిని నిర్మించాలని గ్రామస్థులు అధికారులను కోరారు. బ్రిడ్జి నిర్మాణంతో రెండు మండలాలకు దగ్గర దారి ఏర్పడటంతో పాటు రైతులకు, పలు గ్రామాల ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని వారు చెబుతున్నారు. వెంటనే నిర్మాణం పనులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

చెరువులోకి మురుగునీరు..
పట్టించుకునే వారేరీ?



సమీప ఇళ్ల నుంచి చెరువులోకి వెళ్తున్న మురికినీరు

నర్సాపూర్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ పట్టణ పరిధిలోని రాయరావు చెరువులోకి సమీప ఇళ్ల నుంచి మురికి నీరు పెద్ద ఎత్తున చేరి కలుషితమవుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాయరావు చెరువు ఆయకట్టు కింద సుమారు 500 ఎకరాల వరకు సాగుభూమి ఉంటుంది. ఈ చెరువు పంటలకు నీరందించడమే కాకుండా పట్టణానికి చెందిన రజకులు కూడా ఇదే చెరువు వద్ద బట్టలు ఉతుకుతారు. దీంతో పాటు సమీపంలోనే శ్మశాన వాటిక ఉండటంతో అంత్యక్రియల అనంతరం ఇదే చెరువులో స్నానాలు కూడా చేస్తారు. అలాంటి చెరువు మురికినీటితో కలుషితమవుతుండటం పట్ల స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నర్సాపూర్ పట్టణ పరిధిలోని 3వ వార్డు పరిధిలో ఉండే ఎన్‌జీవో కాలనీ సమీపంలో కొత్తగా అనేక ఇళ్ల నిర్మాణం జరిగాయి. ఆ ఇళ్ల నుంచి వచ్చే మురికినీరంతా చెరువులోకి కాలువ చేసి వదులుతుండటంతో చెరువులో నీరు కలుషితమవుతుంది. కొత్తగా నిర్మిస్తున్న ఆధునిక ధోబీ ఘాట్ భవనం పక్కనుంచే సమీప ఇళ్ల నుంచి వచ్చే మురికినీరు కాలువ ద్వారా పెద్దమొత్తంలో చెరువులోకి చేరుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెరువులోకి మురికినీరు వెళ్లకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి చెరువు నీటిని కాపాడాలని కోరుతున్నారు.

అంగన్‌వాడీల్లో హాజరు శాతం పెంపునకు బాలమేళా



బాలమేళా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీవో జయరాంనాయక్ తదితరులు

గుమ్మడిదల, అక్టోబరు(ఆంధ్రజ్యోతి) 27: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల హాజరు శాతం పెంపొందించడానికి బాలమేళా కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఐసీడీఎస్ సీడీపీవో జయరాం నాయక్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా చిన్నారుల్లో ఉన్న నైపుణ్యాన్ని అంగన్‌వాడీ టీచర్స్ ద్వారా ప్రదర్శింపజేసి తల్లిదండ్రుల్లో ఉత్సాహాన్ని నింపడమే లక్ష్యమని ఆయన తెలిపారు. ఆదివారం బొంతపల్లి గ్రామంలోని నాలుగు అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుతున్న పిల్లలకు బాలమేళా నిర్వహించారు. కార్యక్రమానికి ఐసీడీఎస్ సీడీపీవో జయరాం నాయక్‌తో పాటు స్థానిక నాయకులు హాజరయ్యారు. ముందుగా సీడీపీవో జ్యోతి వెలిగించి బాలమేళా కార్యక్రమాన్ని ప్రారంభించారు. చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్ల ద్వారా నేర్చుకున్న ఆటపాటలు, నైపుణ్యాలను బాలమేళాలో ప్రదర్శించి అందరినీ ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా సీడీపీవో జయరాం నాయక్ మాట్లాడుతూ పిల్లల హాజరు శాతం పెంచుకునేందుకు అంగన్‌వాడీ సిబ్బంది పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమాదేవి, మాజీ సర్పంచ్ సురభి నాగేందర్ గౌడ్, మాజీ ఆలయ కమిటీ చైర్మన్ ఆలేటి శ్రీనివాస్ రెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవిత, నాయకులు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



చిన్నారులు, గర్భిణులు, బాలింతల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యమిచ్చే అంగన్‌వాడీ కేంద్రాలు అస్తవ్యస్తంగా దర్శనమిస్తున్నాయి. నారాయణఖేడ్ మండల పరిధిలోని ఖాంజీపూర్ అంగన్‌వాడీ కేంద్రం పరిసరాల్లో చుట్టూ పెంట కుప్పలతో అధ్వానంగా మారింది. దీంతో తమ పిల్లల ఆరోగ్య పరిస్థితిపై తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వైరల్ జ్వరాలు, సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న ప్రస్తుత తరుణంలో పిల్లల ఆరోగ్యం ప్రశ్నార్థకంగా మారిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి అంగన్‌వాడీ కేంద్రాల పరిసరాల్లో పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

- నారాయణఖేడ్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి)

ప్రైమరీ టీచర్ల నియామకాలు చేపట్టాలి



ఎమ్మెల్యే రోహిత్‌రావుకు వినతి పత్రం అందజేస్తున్న నిరుద్యోగ అభ్యర్థులు

మెదక్ అర్బన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రీ ప్రైమరీ టీచర్ నియాకాలు చేపట్టాలని డిప్లొమా ఇన్ ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్ కోర్సు పూర్తి చేసిన నిరుద్యోగ అభ్యర్థులు మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావుకు ఆదివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నర్సరీ నుంచి రెండో తరగతి వరకు బోధించడానికి ప్రీ స్కూల్ టీచర్ ఉద్యోగ నియామకాలు చేపడతారని ఐదేళ్ల నుంచి కోర్సు పూర్తి చేసిన వేలాది మంది నిరుద్యోగులు ఎదురుచూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రీ స్కూల్ టీచర్‌గా ఉద్యోగాలు కల్పించే దిశగా కృషి చేయాలని ఎమ్మెల్యేను కోరారు. స్పందించిన ఎమ్మెల్యే సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నిరుద్యోగ అభ్యర్థులు సురేష్, శ్వేత, శ్రావణి, శ్రీకాంత్, మాజిద్, మేఘన ఉన్నారు. అదేవిధంగా మెదక్ పట్టణంలోని స్థానిక అజంపురలో ఏర్పాటు చేసిన అర్బన్ పిల్లల దవాఖానాను ఎమ్మెల్యే ప్రారంభించారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే రోహిత్‌రావు సూచించారు. ఆదివారం పట్టణంలోని దాయర, మండల పరిధిలోని మగ్దూంపూర్ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు లింగం, మండల పార్టీ అధ్యక్షులు శంకర్, సీనియర్ నేత శ్రీనివాస్‌చౌదరి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హఫీజొద్దీన్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తగ్గని దగ్గు, ఆయాసం

(5వ పేజీ తరువాయి)

స్పష్టంగా వెల్లడించకపోవడం ఇంకా మిస్టరీగానే ఉన్నదని చెప్పవచ్చు.

పలువురి పరామర్శ

ఎంసీహెచ్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థినులను సంగారెడ్డి బీఆర్ఎస్ ఎమ్మెల్యే చింతాప్రభాకర్, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరిఅంజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు వెంకటనర్సింహరెడ్డి, నాయకులు పోచారం రాములు, బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు సాయి భాష, గిరిజన సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు జైపాల్‌నాయక్ తదితరులు పరామర్శించి ఘటనకు కారణాలపై ఆరా తీశారు. బాలికలకు మెరుగైన చికిత్స అందించాలని డాక్టర్లకు సూచించారు. జిల్లాలో కేజీబీవీ విద్యార్థినులు అస్వస్థతకు గురై మూడు రోజులు గడుస్తున్నా జిల్లా మంత్రి కానీ, కలెక్టర్ కానీ పరామర్శించకపోవడం బాధాకరమని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

మంత్రి దామోదర్, కలెక్టర్ పరామర్శ

అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను మంత్రి దామోదర్‌రాజనర్సింహ, జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి వేర్వేరుగా ఆదివారం రాత్రి పరామర్శించారు. మంత్రి దామోదర్ మాట్లాడుతూ కేజీబీవీలో వేస్తున్న పెయింటింగ్ వాసన వల్లే విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారని, ఒకట్రెండు రోజుల్లో అందరినీ డిశ్చార్జి చేసి పంపుతామన్నారు. అంతకుముందు ఆయన కలెక్టర్, ఆస్పత్రి డాక్టర్లతో మాట్లాడి ఇప్పటి వరకు బాలికలకు అందించిన వైద్య చికిత్సను అడిగి తెలుసుకున్నారు.

కొలువుల నిలయాలు

(5వ పేజీ తరువాయి)

స్కూల్ అసిస్టెంట్ టీచర్లున్నారని స్టడీ సర్కిల్ డైరెక్టర్ టి.ప్రవీణ్ తెలిపారు. టీచర్ ఉద్యోగాల సాధనలో స్టడీ సర్కిల్ అండగా నిలిచింది. ఆన్‌లైన్ క్లాసులు నిర్వహించడంతో పాటు పోటీ పరీక్షల పుస్తకాలకు బదులు అభ్యర్థులకు స్టైఫండ్ ఇచ్చి ప్రోత్సహించింది.

ఉద్యోగ సాధనలో లైబ్రరీ దోహదపడింది

- పి.చంద్రకళ, దుద్యాల, పట్‌పల్లి మండలం

సంగారెడ్డిలో అద్దె గది తీసుకొని, ప్రతి నిత్యం ఉదయం 7 నుంచి రాత్రి 8 గంటల వరకు లైబ్రరీలోనే ఉండి చదివాను. లైబ్రరీ పుస్తకాలు విద్యా దృక్పథం, ఇతర కాంపిటేటివ్ పుస్తకాలు చాలా ఉపయోగపడ్డాయి. గ్రంథాలయంలో వసతులు సౌకర్యాలు బాగున్నాయి. రెండేళ్ల నుంచి కష్టపడ్డాను. లైబ్రరీ అండగా నిలిచింది. ఎస్జీటీ టీచర్ ఉద్యోగం సాధించాను.

మంచి వాతావరణంలో స్టడీ సర్కిల్ విద్య

- ఎం.వెంకటసాయి, పోసానిపేట, అందోల్ మండలం

సంగారెడ్డిలోని బీసీ స్టడీ సర్కిల్‌కు నిత్యం ఇంటి నుంచి వచ్చి చదువుకునేవాడిని. స్టడీ సర్కిల్‌లో చదువుకునేందుకు అనువైన వాతావరణం ఉంది. స్టడీ సర్కిల్‌లోని లైబ్రరీలో అందుబాటులో ఉన్న పుస్తకాలను చదివి ప్రిపేర్ అయ్యాను. సెకండరీ గ్రేడ్ టీచర్ ఉపాధ్యాయ ఉద్యోగ సాధనలో స్టడీసర్కిల్ చాలా దోహదపడింది. నాలాంటి ఎంతో మంది నిరుద్యోగులకు స్టడీ సర్కిల్ ఉపయోగకరంగా మారింది.

ఏరియా ఆసుపత్రిలో వైద్యసేవలపై
ట్రైనీ అధికారుల ఆరా

నర్సాపూర్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): శిక్షణలో భాగంగా క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్న ఐదుగురు ట్రైనీ సివిల్ సర్వీసెస్ అధికారుల బృందం ఆదివారం నర్సాపూర్ పట్టణంలోని ఏరియా ఆసుపత్రిని సందర్శించి అక్కడ అందుతున్న వైద్య సేవల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో డాక్టర్లు, సిబ్బంది పనితీరు, ఇక్కడ వైద్య పరీక్షలకు సంబంధించిన పరికరాలు, వాటి పనితీరు అడిగి తెలుసుకున్నారు. వారి వెంట మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, మున్సిపల్ మేనేజర్ మధుసూధన్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ శ్రీకాంత్, సబ్‌ఇంజనీర్ భూపాల్, శానిటరీ సూపర్‌వైజర్ మురళి పాల్గొన్నారు.

బీజేపీతోనే దేశాభివృద్ధి: బీజేపీ రాష్ట్ర నేత రవీందర్



బీజేపీ సభ్యత్వ నమోదు చేయిస్తున్న నాయకులు

జహీరాబాద్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యపడుతుందని బీజేపీ రాష్ట్ర నాయకుడు ఆదెల్లి రవీందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం జహీరాబాద్ పట్టణంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఉత్సాహంగా చేపట్టాలన్నారు. రాష్ట్రంలో ఆలయాలపై దాడులు జరుగుతున్నప్పటికీ పట్టించుకునే వారు కరువయ్యారని విచారం వ్యక్తం చేశారు. అలాగే జహీరాబాద్‌లో పోలీసులు హిందూసంఘాల కార్యకర్తలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో ఓబీసీమోర్చరాష్ట్రనాయకులు సుధీర్‌బండారీ, నాయకులు శ్రీనివాస్‌గుప్త, అరుణకౌశాస్, శివాజీపాటీల్, శ్రీనివాస్‌గౌడ్, నౌబాద్‌జగన్, గొల్లభాస్కర్, స్వామి, దుర్గయ్య, ఓంకార్, వైద్యనాథ్, పూలసంతోష్, రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రత్యేకాధికారుల పాలనలో
కంపుకొడుతున్న గ్రామాలు



నిజాంపేటలో మురుగు కాల్వ దుస్థితి



ఖాంజీపూర్‌ప్రధాన రోడ్డుపై మురుగు నీరు

నారాయణఖేడ్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): గ్రామాలు పారిశుధ్య సమస్యలతో కంపుకొడుతున్నా ప్రత్యేకాధికారులు పట్టించుకోవడం లేదని పలు గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. సర్పంచుల పదవీ కాలం గత ఫిబ్రవరిలో పూర్తి కావడంతో గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన ప్రారంభమైన విషయం తెలిసిందే. ప్రత్యేకాధికారులు అధికశాతం గ్రామాలను సందర్శించక పోవడంతో పాలన పంచాయతీ కార్యదర్శుల ఇష్టారాజ్యంగా మారింది. గ్రామాల్లో మురుగు కాల్వలు పూడికతీతకు నోచుకోవడం లేదు. పలు గ్రామాల్లో దసరా పర్వదినాన్ని సైతం వీధిదీపాలు లేక చీకట్లోనే జరుపుకోవాల్సి వచ్చిందని ప్రజలు మండిపడుతున్నారు. ఖేడ్ పరిధిలోని మండల కేంద్రమైన నిజాంపేటకు ప్రత్యేకాధికారిగా తహసీల్దార్ ఉన్నప్పటికీ ఏ ఒక్క రోజు గ్రామంలో పర్యటించలేదని ఆ గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇటీవల నమ్లీమేట్‌లో నాలుగు రోజులు నీటి సరఫరా నిలిచిపోయినా ఎవరూ పట్టించుకోలేదని చెబుతున్నారు. సంజీవన్‌రావుపేటలో తాగు నీరు కలుషితం కావడంతో 50 మందికి పైగా అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. పీర్ల తండాలో ఓటర్ల జాబితా సక్రమంగా సరి చేయలేదనిగ్రామస్తులు ఆరోపిస్తున్నారు. జూక్కల్‌లో మురుగుకాల్వల్లో చెత్త పేరుకుపోవడమే కాకుండా వీధి దీపాలు కూడా వెలుగడం లేదని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఖాంజీపూర్‌లో మురుగునీరు ప్రధాన రోడ్డుపై పారుతున్నా అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడంలేదని స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.